క్లుప్తంగా

పుస్తక పఠనంతో విజ్ఞానం



రంగంపేట శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

రంగంపేట: పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన సాధ్యమవుతుందని గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగింది. ముందుగా విద్యార్థులు సరస్వతీ పూజ చేశారు. అనంతరం విద్యార్థులకు నీతి కథలు బోధించారు. శరీరక దృఢత్వానికి యోగా అవసరం అన్నారు. విజ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనమే ఆధారమని, నిత్యం గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలని సూచించారు. రిటైర్డ్ ఇరిగేషన్ ఉద్యోగి పీవీ ప్రసాద్ పాల్గొని విద్యార్థులకు తెలుగు శతక పద్యాలు వివరించారు. జనరల్ నాలెడ్జ్‌పై శిక్షణ ఇచ్చారు.

మజ్జిగ పంపిణీ

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి నాలుగు బొమ్మల సెంటర్‌లో షిర్డీ సాయిబాబా వసతి మందిరం వారు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో శుక్రవారం మజ్జిగను పంపిణీ చేశారు. దాతల సహకారంతో వాహనదారులకు, పాదచారులకు మజ్జిగను అందజేశారు.

53 మంది విద్యార్థుల గైర్హాజరు

సీతానగరం: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షకు మండలంలో 53 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓలు కె.స్వామినాయక్, టి.ముత్యాలు శుక్రవారం తెలిపారు. సోషల్ పరీక్షకు రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూలు పరీక్ష కేంద్రంలో 21 మంది హాజరై, 29 మంది గైర్హాజరయ్యారన్నారు. అదేవిధంగా వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూలు పరీక్ష కేంద్రంలో 17 మంది హాజరై, 24 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వివరించారు. ఇంతటితో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ముగిశాయని చెప్పారు.

రంగంపేటలో 17 మంది

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ కెమిస్ట్రీ పరీక్షకు శుక్రవారం 17 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం జరిగిన మొదటి సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పేపర్–1 పరీక్షకు 211 మంది విద్యార్థులకు గాను 199 మంది, మధ్యాహ్నం జరిగిన రెండో ఏడాది కెమిస్ట్రీ, కామర్స్ పేపర్–2 పరీక్షకు 63 మందికి 58 మంది హాజరయ్యారని వివరించారు.

నేడు హనుమజ్జయంతి పూజలు

అనపర్తి: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. స్థానిక కెనాల్ రోడ్డు చిన్న కార్ల స్టాండ్ వద్ద అభయాంజనేయ స్వామివారి ఆలయంలో లక్షపత్రి పూజ, ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు పెద్దింటి వేణుగోపాలాచార్యులు తెలిపారు. పాతవూరులోని బాపనమ్మ గుడి సమీపంలో రజక వీధి వద్ద అభయ ఆంజనేయస్వామి వారి ఆలయంలో స్వామికి విశేష అభిషేకాల అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుంది.

చురుగ్గా చిల్డ్రన్స్ పార్కు, ఓపెన్ జిమ్ పనులు



కాపవరం శివారులో జరుగుతున్న చిల్డ్రన్స్ పార్కు, ఓపెన్ జిమ్ పనులు

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలో చిన్నారుల పార్కు, ఓపెన్ జిమ్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడ చిన్నారుల ఆట వస్తువులతో కూడిన పార్కుతో పాటు, ఓపెన్ జిమ్ నిర్మిస్తున్నారు. రుడా ఆధ్వర్యంలో రూ.కోటి నిధులతో ఈ నిర్మాణం జరుగుతోంది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవ చూపడంతో ఇక్కడ పార్కు ఏర్పాటవుతోంది. చిన్నారులు ఆడుకునేందుకు ఆరు ఆట వస్తువులు అందుబాటులో ఉంటాయి. అందులో జారుడు బల్లలు, రంగుల రాట్నం, ఊయలలు తదితర వస్తువులు ఉన్నాయి. యువత కోసం ఎనిమిది రకాల పరికరాలతో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరం

కంబాలచెరువు: మైనర్లకు మోటార్ వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మైనర్లు, వారి తల్లిదండ్రులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మూడు రోజులుగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు రోజులుగా మొత్తం 30 మంది మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నామన్నారు. వారు, వారి తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలకు కౌన్సెలింగ్ నిర్వహించి, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించామన్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేని వారికి వాహనాన్ని ఇవ్వరాదని పెద్దలకు వివరించామన్నారు.

సేంద్రియ సాగు... బహు బాగు

- ఈ విధానానికే రైతుల మొగ్గు
- తక్కువ ఖర్చుతో అధిక లాభాలు



పెదపూడిలో పశువుల పేడ, చెత్త, పెంటను ట్రాక్టర్‌పై పొలానికి తరలిస్తూ..

పెదపూడి: కాలం మారుతోంది.. సాగులో రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గుతోంది.. ఇది ప్రజల ఆరోగ్యానికి హాని కారకమవుతుంది. ఈ నేపథ్యంలో అంతా సేంద్రియ ఎరువుల వినియోగంపై మొగ్గు చూపుతున్నారు. దీనిని వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. రసాయన ఎరువుల వాడకంతో వచ్చే అనర్థాలను గుర్తించిన పలువురు రైతులు భూసారం పెంపునకు దృష్టి సారించారు. పశువుల పేడ, కోడిపెంట, చీకిన గడ్డితోపాటు చెరువులు, కుంటల్లోని పూడిక మట్టిని పొలాల్లో వేస్తున్నారు. కొంతకాలంగా తరచూ రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోయి పంటలు, పైర్లకు చీడపీడలు సోకి ఉత్పత్తులు తగ్గిపోయి నష్టాలను చవిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలనిచ్చే సేంద్రియ ఎరువులనే వాడాలని ముందుకు సాగుతున్నారు. పశు సంపద లేని రైతులు, కోళ్లఫారాల్లోని పెంట, చెరువులు, కుంటల్లో పూడిక మట్టిని కొనుగోలు చేసి పొలాల్లో వేస్తున్నారు. దీంతో తక్కువ వ్యయంతో అధికం ప్రయోజనం లభిస్తుంది.

నియోజకవర్గంలో ఇలా..

పెదపూడి, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో సుమారు 47 వేల ఎకరాల్లో సాగు జరుగుతోంది. ఇందులో సుమారు 40 శాతం మంది రైతులు సేంద్రియ ఎరువులు వాడకానికి ప్రయత్నిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఈ విధంగా పొలాలకు మట్టి, పెంటను తరలించుకుంటున్నారు. పంటల దమ్ములకు ముందే సేంద్రియ ఎరువులను పొలాల్లో వేసి కలియ దున్నితే త్వరగా మట్టిలో కలిసిపోయి, మంచి ఫలితాలను ఇస్తాయని పలువురు రైతులు చెబుతున్నారు.

ప్రయోజనాలు ఎక్కువ..

- సేంద్రియ ఎరువులు వాడితే పొలాలకు ప్రయోజనాలు ఎక్కువ ఉంటాయి. వీటి ద్వారా పంటకు కావాల్సిన అన్ని ముఖ్యమైన పోషకాలను అందించవచ్చు.
- భూమిలో నీటిని నిల్వ చేయడానికి సేంద్రియ ఎరువుల ఉపయోగపడతాయి. దీనివల్ల భూమిలో తేమశాతం ఎక్కువ రోజులు ఉండి పంటలు ఎండిపోవు.
- నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నప్పుడు సేంద్రియ ఎరువులు భూమి పొరలలో ఉండే నీటిని మొక్కలకు లభ్యమయ్యేటట్లు చేస్తాయి.
- సేంద్రియ ఎరువులు భౌతిక లక్షణాలను ప్రభావితం చేస్తాయి. ఇసుక నేలల్లో మెత్తని మట్టి శాతాన్ని పెంచడానికి, నీటిని పట్టి ఉంచే శక్తి పెంపొందించడానికి దోహదపడతాయి. ఫలితంగా మొక్కలు పరిస్థితులు తట్టుకుని పెరగడానికి వీలు పడుతుంది.
- వివిధ రకాల రసాయన ఎరువులతో కలిగిన సమస్యలను సేంద్రియ ఎరువుల వాడకంతో పరిష్కరించుకోవచ్చు.
- నేలలో మొక్కలకు మేలు చేసే అనేక రకాల సూక్ష్మజీవులుంటాయి. ఈ సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందడానికి సేంద్రియ ఎరువుల ఆహారంగా ఉపయోగపడతాయి.
- సేంద్రియ ఎరువులు వాడిన పొలాల్లో, చీడపీడలు, తెగుళ్లు తక్కువగా ఉంటాయి. ఈ పొలాల్లో నాణ్యమైన దిగుబడి వస్తుంది.

పంటలకు ఎంతో మేలు



పొలాల్లో సేంద్రియ ఎరువుల వాడకంతో పంట పొలాలకు మేలు జరుగుతుంది. రైతుకు తక్కువ ఖర్చుతో చాలా లాభాలు ఉంటాయి. నాణ్యమైన పంటలు పండుతాయి. భూసారం పెరిగి, చీడపీడలు తగ్గుతాయి. దిగుబడులు ఆశాజనకంగా ఉండి లాభాలు పొందవచ్చు.

–టీవీఆర్ మణిదీప్, మండల వ్యవసాయ శాఖ అధికారి, పెదపూడి

● ఏమి హాయిలే ఇలా..!



మోటారు సైకిల్‌పై గొడుగులా అమర్చిన వస్తువు

సీతానగరం: వేసవి ఉష్ణోగ్రతలు దంచికొడుతున్నాయి. కారులో వెళ్లే వారికి ఏసీ ఉంటే చాలు. ద్విచక్ర వాహనదారులకైతే వేసవి ఓ శాపం. ఎక్కడకు వెళ్లాలన్నా ఎండలు తట్టుకోవడం అసాధ్యం. వీరికి సౌకర్యంగా ఉండేలా, నీడను ఇచ్చేందుకు గొడుగు లాంటి వస్తువు మార్కెట్‌లోకి వచ్చింది. వివిధ రంగుల్లో లభించే వీటిని రూ.400 వరకు విక్రయిస్తున్నారు. రెండు ఊచలకు అమర్చిన గొడుగు లాంటి వస్తువును బైక్ వెనుక ఉన్న రాడ్డుకు, అలాగే హ్యాండిల్‌కు ఉండే మిర్రర్ రాడ్లకు కడుతున్నారు. ఇందులో ఎండ పడకుండా ప్లాస్టిక్ క్లాత్, ముందుభాగంలో పారదర్శకంగా ఉండే కవర్ ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించేలా రూపొందించారు. ఇవి ఏర్పాటు చేసుకుని అనేక మంది హాయిగా బైక్‌పై ప్రయాణం చేస్తున్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



త్రినాథ్, వెంకట మంగతాయారు దంపతులను అభినందిస్తున్న కార్యదర్శులు, అధికారులు

పెదపూడి: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు దానికదే వస్తుందని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెద్దాడ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా గొలకోటి త్రినాథ్‌రావు రెండేళ్లగా పనిచేసి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా త్రినాథ్‌రావు, ఆయన సతీమణి వెంకట మంగతాయారు దంపతులకు అభినందన సభ నిర్వహించారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ త్రినాథ్ ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం అందించిన సేవలు ఎనలేనివన్నారు. అనంతరం త్రినాథ్ దంపతులను సత్కరించారు. సర్పంచ్ డొకుబుర్ర మీనాక్షి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ పాలచర్ల రామకృష్ణ చౌదరి, డొకుబుర్ర కృష్ణ, కాకర అప్పారావు, సామర్లకోట ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యరెడ్డి, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, బి.ప్రసన్నకుమార్, సుంకర వీరస్వామి నాయుడు, లక్ష్మీనారాయరాణ, తరుణ్, గౌతమీ చంద్ర, ఎం.చిన్ని పాల్గొన్నారు.

దుర్గాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు



రంగంపేటలో విజయ దుర్గాంబిక అమ్మవారు

రంగంపేట: స్థానిక మంచినీటి చెరువు వద్ద కొలువై ఉన్న శ్రీవిజయ దుర్గాంబిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణశర్మ తెల్లవారుజామునే అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దివ్యాంగులను పాఠశాలల్లో చేర్పించండి



బిక్కవోలులో న్యూ ఎన్‌రోల్‌మెంట్ సర్వే చేస్తున్న విద్యాశాఖ అధికారులు

బిక్కవోలు: దివ్యాంగులను పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా సహిత విద్యా కో ఆర్డినేటర్ ఎస్.కనకబాబు సూచించారు. బిక్కవోలులో శుక్రవారం ప్రత్యేకావసరాలు గల పిల్లల న్యూ ఎన్‌రోల్‌మెంట్ సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సర్వేలో కనకబాబు పాల్గొని మాట్లాడారు. ఐదేళ్లు నిండిన పిల్లలు పాఠశాలల్లో చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల ఉచిత సేవలను వినియోగించుకోవాలన్నారు. ఐఈఆర్పీలు ప్రతి ఇంటికి తిరిగి ప్రత్యేకావసరాలు గల పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

అనపర్తి: ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు ప్రక్రియను అనపర్తిలో చేపట్టారు. న్యూ ఎన్‌రోల్‌మెంట్ సర్వేలో భాగంగా ఎంఈఓ–2 నల్లమిల్లి సత్తిరెడ్డి, జిల్లా సహిత విద్యా కో ఆర్డినేటర్ ఎస్.కనకబాబు, ఐఈఆర్పీలు ఎ.సత్యనారాయణ, పి.అనూరాధ బృందం పర్యటించారు. ఐదేళ్లు నిండిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థినీ విద్యార్థులను గుర్తించి భవిత కేంద్రంలో అందించే ప్రత్యేక విద్యా బోధన, స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీతోపాటు ప్రభుత్వం అందించే వివిధ సేవలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మండలంలో ఇప్పటి వరకూ 22 మందిని గుర్తించామని, వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకున్నట్లు ఎంఈఓ తెలిపారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం

రోడ్డెక్కిన గ్రామస్తులు



రఘుదేవపురంలో స్థానికుల ఆందోళన

సీతానగరం: సాంకేతిక సమస్య తలెత్తడంతో మండలంలోని రఘుదేవపురంలో గురువారం అర్ధరాత్రి విద్యుత్ సరఫరాకు విఘాతం కలిగింది. సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు తీసుకోవడంలో కొంత జాప్యం జరగడంతో, వేసవి తీవ్రతకు అసహనానికి గురైన స్థానికులు రోడ్డెక్కారు. వివరాల్లోకి వెళితే.. రఘుదేవపురం పంచాయతీ కార్యాలయం వద్ద సుమారు 200 ఇళ్లకు గురువారం అర్ధరాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ మేరకు శుక్రవారం విద్యుత్ సిబ్బందికి స్థానికులు సమాచారం ఇచ్చారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు నెలకొనడంతో, వాటి మరమ్మతులకు సిబ్బంది వెళ్లడంతో, వారు స్థానికులకు అందుబాటులో లేరు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రాజమహేంద్రవరం–సీతానగరం రోడ్డుపై బైఠాయించారు. ఈ క్రమంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని, వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించేశారు. విషయం తెలుసుకున్న ఏపీఈపీడీసీఎల్ సీతానగరం ఏఈ చంద్రమోహన్ తన సిబ్బందితో వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వివిధ ప్రాంతాల్లో కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, వాటికి మరమ్మతులు చేయడంలో కొంత జాప్యం జరిగిందని చెప్పారు. అన్నిచోట్లా విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని ఏఈ తెలిపారు.

నెల రోజుల పాటు ఉచిత వైద్య సేవలు

రాజానగరం: జీఎస్ఎల్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆస్పత్రిలో శనివారం నుంచి జూలై ఒకటి వరకు నెల రోజుల పాటు ఉచిత వైద్య సేవలు అందించనున్నట్టు ఆస్పత్రి చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు తెలిపారు. డాక్టర్స్ డే అయిన జూలై ఒకటిన వైద్య కళాశాలను ప్రారంభించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నెల రోజులు అన్ని రకాల చికిత్సలు, మెడికల్ ప్రొసీజర్లు, సర్జరీలు ఉచితంగా చేస్తామన్నారు. వైద్య పరీక్షలు, ఇన్వెస్టిగేషన్లకు సంబంధించిన ఫీజుల్లో మాత్రం 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో చేసే వైద్య సేవలు యథావిధిగా కొనసాగుతాయని, ఈ పథకంలోకి రాని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

ధూమపానంతో ప్రాణాంతక వ్యాధులు



ఇనుగంటివారిపేటలో నిర్వహించిన ప్రపంచ పొగాకు రహిత దినం

సీతానగరం: పొగాకు వాడకం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకుతాయని సీతానగరం పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు హెచ్చరించారు. శుక్రవారం ప్రపంచ పొగాకు రహిత దినం సందర్భంగా ఇనుగంటివారిపేట సచివాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయుడు మాట్లాడుతూ పొగాకును చుట్ట, బీడీ, సిగరెట్లు, పాన్ ఏ రూపంలో తీసుకున్నా మనుషుల్లో అనేక దుష్ప్రభావాలు కలిగిస్తుందన్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలకు దారి తీస్తుందన్నారు. పొగాకు వాడకాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. అనంతరం పొగాకు వాడకానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. మండలంలోని పలు గ్రామాల్లో వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రపంచ పొగాకు రహిత దినం కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ఈ.శ్రీజ, మహిళా పోలీస్ కె.అమ్మాజీ, ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణవేణి, ఏఎన్ఎం సీహెచ్ శాంతి, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

డీవైఈఓ నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈఓ నారాయణ

సీతానగరం: మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని మిడ్‌డే మీల్స్ ఇంప్లిమెంట్ ఏజెన్సీల వారికి డీవైఈఓ ఈ.నారాయణ ఆదేశించారు. శుక్రవారం సీతానగరం మండల రీసోర్స్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. పాఠ్య పుస్తకాలు ఎన్ని వచ్చాయని ఆరాతీశారు. అనంతరం ప్రభుత్వ హైస్కూల్‌లో మండలంలోని మిడ్‌డే మీల్స్ ఇంప్లిమెంట్ ఏజెన్సీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వంటలు చేసే సమయంలో శుభ్రతను పాటించాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెను ప్రకారం ఆహారం అందించాలన్నారు. నాణ్యమైన ఆహారం అందిస్తే, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి, చదువులో ప్రతిభ చూపుతారని చెప్పారు. త్వరలో స్కూళ్లు పునః ప్రారంభమవుతాయని, ఇంప్లిమెంట్ ఏజెన్సీల నిర్వాహకులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీఎం సూపరింటెండెంట్ డి.రామకృష్ణ, ఎంఈఓలు కె.స్వామినాయక్, టి.ముత్యాలు, ఇన్‌చార్జి హెచ్ఎం కన్నూరి సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎండను తట్టుకునేదెట్టా..?

- బయటకు రావడానికి జంకుతున్న జనం
- జ్యూస్‌లు, శీతల పానీయాలే దిక్కు



ఎండ వేడిని తట్టుకోలేక జ్యూస్ తాగేందుకు వచ్చిన మహిళలు, పిల్లలు



చెట్టు నీడలో సేద తీరుతున్న రిక్షా కార్మికుడు

ప్రకాశం నగర్: భానుడి మహోగ్ర రూపానికి జనం అల్లాడుతున్నారు. రోహిణీ కార్తె ప్రభావంతో వారం రోజులుగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో, నగరవాసులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఎండ తీవ్రత నుంచి తమను తాము కాపాడుకునేందుకు రక్షణ చర్యలపై దృష్టి సారిస్తున్నారు. ఎండ వేళ ఇంటి పట్టునే ఉండడం, అత్యవసర పనులకు బయటకు రావాల్సి వస్తే, జ్యూస్‌లు, బటర్‌మిల్క్, చల్లటి పానీయాలు, కొబ్బరి బొండాలు వంటివి సేవిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో, వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే వై.జంక్షన్, హైటెక్ బస్టాండ్, నందం గనిరాజు జంక్షన్, దానవాయిపేట వంటి ప్రాంతాలు కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించాయి. ముఖ్యంగా రోజువారీ కూలీ చేసుకునే వారు ఎండ వేడిని తట్టుకోలేక చెట్ల కింద సేద తీరడం కనిపించింది.

ఎండ తీవ్రత నేపథ్యంలో నగరంలో పలుచోట్ల స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు, వ్యాపార సంస్థల వారు ప్రధాన సెంటర్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రజలకు తాగునీరు, మజ్జిగను పంపిణీ చేస్తున్నారు. వీటితో పాటు జనం ఎండ వేడిమి తట్టుకునేందుకు కొబ్బరి బొండాలు, కూల్ డ్రింకులు, సోడాలు, పండ్ల జ్యూస్‌లను తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో శీతల పానీయాలకు డిమాండ్ పెరిగింది. ఇక రాజమహేంద్రవరంలో అత్యంత ప్రాచుర్యం పొందిన రోజ్ మిల్క్, కోవా, సేమియాతో పాటు, కోకోనట్ జ్యూస్ వంటి వాటిని తాగేందుకు జనం క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో కొబ్బరి బొండాల ధరలు ఆకాశాన్నంటాయి. ఒక్క బొండాం ధర రూ.30కి విక్రయించగా, కొబ్బరి నీరు లీటరు రూ.140కు అమ్ముతున్నారు. వీటితో పాటు వివిధ రకాల కూల్‌డ్రింకులు, సోడాలు, బటర్ మిల్క్, లస్సీ, ఫ్రూట్ జ్యూస్‌ల ధరలూ గణనీయంగా పెరిగాయి.

వర్షాల కోసం ఎదురుచూపు

జూన్ మాసం ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో.. ఎండ తీవ్రతకు తల్లడిల్లుతున్న జనం నైరుతి రుతు పవనాల కోసం ఎదురు చూస్తున్నారు. రుతు పవనాల రాకతో వర్షాలు కురిసి, వాతావరణం కాస్త చల్లబడుతుందని గంపెడాశతో ఉన్నారు.